సాక్షి చిత్తూరు

శుక్రవారం । 18 । జూలై । 2025



మామిడి ర్యాంపుల్లో సిండికేట్!

మామిడి ర్యాంపుల్లో వ్యాపారులు సిండికేట్ అయ్యారు. ధర తగ్గిస్తూ మామిడి రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. - 8లో



మామిడి దినోత్సవానికి రండి

చిత్తూరులో ఈనెల 22న జరిగే మామిడి దినోత్సవానికి రైతులు తరలి రావాలని ఆ సంఘ నేతలు కోరారు. - 8లో



తప్పుడు కేసుతో వేధిస్తున్నారు

దారి కోసం తన ఇంటి స్థలం ఇవ్వలేదన్న నెపంతో ఓ టీడీపీ నాయకుడు వేధిస్తున్నాడని బాధితురాలు వాపోయారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : పాత పెన్షన్ సాధనకు డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ ధర్నాలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం గళమెత్తనున్నారు. ఈ ధర్నాలో జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలు, డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ టీచర్లు పాల్గొననున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు ముగ్గురు హాజరు



డైట్ కళాశాలలో విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో గురువారం నుంచి ప్రారంభమైన సర్టిఫికెట్ల పశీలనకు ముగ్గురు అభ్యర్థులు హాజరైనట్లు కళాశాల ఇన్‌చార్జి డీకే దామోదరం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 17 నుంచి 22వ తేదీ వరకు డైట్ అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. 91 మంది గవర్నమెంట్ కళాశాలకు, 103 మంది ప్రైవేటు కళాశాల విద్యార్థులు హాజరవ్వాల్సి ఉందని తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ముగ్గురు విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. అధ్యాపకులు నాగరాజనాయక్, దశరథుడు, మునిక్రిష్ణ, సూపరింటెండెంట్ కృపావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పలమనేరుకు 13వ ర్యాంకు

పలమనేరు : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పలమనేరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 386 ర్యాంకు సాధించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి గురువారం ఉత్వర్వులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ రమణారెడ్డి మాట్లాడారు. మున్సిపాలిటీలో తడి, పొడిచెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, నీటి వనరుల శుభ్రత తదితర అంశాలపై కేంద్రం ర్యాంకులను ప్రకటించిందని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మున్సిపాలిటీకి 272, చిత్తూరు 273, పలమనేరు 386, పుత్తూరు 508, నగరి 666, కుప్పం 1478 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. సహకరించిన పట్టణ ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

26న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ 1–7 స్థాయి సంఘాల సమావేశం ఈనెల 26న శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.



ఆరోగ్యశ్రీకి ఉరి!

పేదల ఆరోగ్యానికి దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి కొండత భరోసానిచ్చారు. ఆరోగ్యశ్రీ పథకానికి పురుడుపోసి ఊపిరిపోశారు. ఉచితంగానే ఖరీదైన వైద్య సేవలందించి అండగా నిలిచారు. ఆ తర్వాత ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సైతం తండ్రిబాటలోనే నడిచారు. ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారు. వేలాది చికిత్సలను పథకంలో చేర్చి ప్రజానేతగా రోగుల మదిలో నిలిచారు. అయితే ఈ పథకాన్ని రద్దు చేసే దిశగా కూటమి నేతలు అడుగులు వేస్తున్నారు. దీనిపై పలువురు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

పథకాన్ని నీరుగార్చేందుకు కూటమి కుట్ర

- ఆయుష్మాన్ భారత్‌కు రంగం సిద్ధం
- ఉద్యోగులకు శిక్షణలు
- త్వరలో ప్రారంభించనున్న వైనం
- ప్రశ్నార్థకంగా ఆరోగ్య మిత్రల భవిష్యత్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. జేబులో ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కార్పొరేట్ ఆస్పత్రిలోనే దర్జాగా ఉచితంగా వైద్యం చేయించుకునే హక్కును ఆయన పేదలకు కల్పించారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి మరిన్ని మెరుగులు అద్దారు. గత టీడీపీ ప్రభుత్వంలో 1,800 లోపు ఉన్న చికిత్సలను ఆయన 3,255కు పెంచారు. ఈ పథకం ద్వారా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోనూ ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు పొందే విధంగా వెసులుబాటు కల్పించారు.

నిధులు ఎలా?

ఇకపై జిల్లా కలెక్టర్ నుంచి నిధులు ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా సంబంధిత నెట్వర్క్ ఆస్పత్రులకు క్లైమ్ అమౌంట్ విడుదలవుతోంది. ఆయుష్మాన్ భారత్ అమల్లోకి వస్తే క్లైమ్ అప్రూవల్ ఇచ్చాక నిధులను కలెక్టర్ నుంచి విడుదల చేయనున్నట్లు సమాచారం. నెట్వర్క్ ఆస్పత్రులపై ఏవైనా ఫిర్యాదులొచ్చినా కలెక్టర్ నేరుగా చర్యలు తీసుకునే అధికారం కల్పించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సైతం ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తేనే నిధులు ఇస్తామని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. ఏడాదిగా కేంద్రం ఇస్తున్న నిధులను ఇతర పథకాలకు వాడుకుంటున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్ అమలుకు ప్రత్యేకంగా ఒక మెడికోను ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి ఎలా?

ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తేసి ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చే యోచనలో కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకం అమల్లో ఉంది. కాగా ఆరోగ్యశ్రీ కంటే ఆయుష్మాన్ భారత్‌లో వ్యాధుల సంఖ్య 1,900లోపే ఉండడం.. ప్యాకేజీ కూడా తక్కువగా ఉండడంతో ప్రైవేటు ఆస్పత్రులు దీనిపై నిరాసక్తి చూపుతున్నట్లు సమాచారం.

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేసి 1000 వ్యాధులను బీమా పరిధిలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు నూతన ఆరోగ్య పాలసీ రూపొందించే పనిలో కూటమి పెద్దలు ఉన్నట్లు స్పష్ట మవుతోంది.



చిత్తూరు ఆస్పత్రిలోని ఆరోగ్య శ్రీ హెల్ప్ డెస్క్



చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు	
ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు	4
ప్రైవేటు ఆస్పత్రులు	9
సీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు	7
పీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు	47
డెంటల్ క్లినిక్‌లు	7
మొత్తం	74

ఆరోగ్యశ్రీ విభాగంలో పని చేసేవారు	
జిల్లా కో–ఆర్డినేటర్–	1
టీమ్ లీడర్లు	2
డీఈఓ	1
ఆరోగ్య మిత్రలు	48

కూటమి ప్రభుత్వం వచ్చాక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పథకాన్ని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చేశారు. అయినప్పటికీ ప్రజలు ఆరోగ్యశ్రీ గానే పిలుస్తుండడాన్ని పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా ఈ పథకాన్ని తొలగించాలనే కుట్రకు పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆయుష్మాన్ భారత్‌ను తెరపైకి తీసుకొస్తున్నట్లు తాజా పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఈ విషయమై ఇప్పటికే ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఐదు విడతల శిక్షణ కూడా పూర్తి చేసుకున్నారు. మరో నెల రోజుల్లో పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

'మిత్ర'ద్రోహమే!

ఆరోగ్యశ్రీ స్థానంలో ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చి లాగిన్ అవకాశాన్ని సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రిలోని మెడికో ద్వారా చేపట్టనుండడంతో ఆరోగ్య మిత్రల ఉనికి ప్రశ్నార్థకం కానుంది. ఒకవైపు పథకాన్ని మార్చే పనులు వేగవంతంగా చేస్తున్నా మిత్రల గురించి మాత్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో 48 మంది వైద్యమిత్రలు పనిచేస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఇందులో చాలామంది ఉద్యోగులు ట్రస్టును నమ్ముకుని పనిచేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వీరి మెడపై కత్తి వేలాడ తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 8వ ర్యాంక్

చిత్తూరు అర్బన్ : స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో చిత్తూరు నగరపాలక సంస్థకు రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ లభించింది. అలాగే జాతీయ స్థాయిలో 273వ ర్యాంక్ కైవసం చేసుకుంది. జీఎఫ్‌సీ (గార్బేజ్ ఫ్రీ సిటీ)లో మొదటి సారి చిత్తూరు స్టార్ రేటింగ్ సాధించింది. ఈ మేరకు గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్–2024 ఫలితాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఫలితాలను నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగంలో సింగల్ స్టార్ రేటింగ్, ఓడీఎఫ్ ప్లస్ సర్టిఫికెట్‌ను సాధించినట్లు చెప్పారు. 1–10 లక్షల జనాభా కేటగిరీలో జాతీయ స్థాయిలో 824 నగరాలతో పోటీపడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ 273వ ర్యాంక్ పొందిందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో 67 నగరాలతో పోటీపడుతూ 8వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో గత ఏడాది 446 నగరాలు పోటీపడగా ఈ ఏడాది ఏకంగా 824 నగరాలు పోటీలో ఉన్నాయన్నారు. జనాభా పరంగా మనకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలతో దీటుగా చిత్తూరు పోటీపడినట్లు తెలిపారు. పారిశుద్ధ్యం, ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ, ఓడీఎఫ్ ప్లస్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరీలో గతంకంటే మెరుగైన మార్కులు వచ్చాయన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో మెరుగైన ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత మెరుగైన ర్యాంక్ సాధించేందుకు కృషి చేస్తామని కమిషనర్ వెల్లడించారు.

భాను నోరు అదుపులో పెట్టుకో!

- నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు మాజీ మంత్రి రోజా స్ట్రాంగ్ వార్నింగ్
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై తప్పుడు కేసుల బనాయింపుపై మండిపాటు

పుత్తూరు: 'భాను నోరు అదుపులో పెట్టుకో.. తప్పుడు కూతలు కూస్తే తోలు తీస్తా' అంటూ మాజీ మంత్రి ఆర్కేరోజా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక కేసులో నగరిలో పట్టుబడిన టీడీపీకి చెందిన వారిని వదిలి రాత్రికి రాత్రి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై అక్రమ కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. నగరి కౌన్సిలర్లు బీడీభాస్కర్, బిలాల్‌ను బుధవారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసిన నగరి పోలీసులు, గురువారం పుత్తూరు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వీరికి 14 రోజులు రిమాండ్ విధించడంతో సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. విషయం తెలుసుకొని పుత్తూరు కోర్టు వద్దకు వచ్చిన మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు. నగరిలో ఇసుక అక్రమ రవాణా కేసులో పట్టుబడిన వారందరూ టీడీపీకి చెందిన వారని తెలిపారు. నగరి ఎమ్మెల్యే భానుకు ముఖ్య అనుచరుడైన భరత్ సైతం అరెస్టయిన వారిలో ఉన్నాడని ఆమె పేర్కొన్నారు.

అది సాధ్యపడేనా?

రాజంపేట నుంచి తిరుపతి మీదుగా నగరికి వచ్చిన టిప్పర్లు ఇక్కడ ఇసుకను డంపింగ్ చేసుకొని తమిళనాడుకు తరలించాలంటే అది వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్ల వల్ల జరిగే పనేనా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. రాజంపేట, తిరుపతి, నగరిలో కూటమి ఎమ్మెల్యేలు ఉండగా మూడు జిల్లాలకు చెందిన ఎస్పీలు, కలెక్టర్లను, మైనింగ్ ఆఫీసర్లను మేనేజ్ చేయడం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు సాధ్యపడే పనేనా అంటూ ప్రశ్నించారు. ఎక్కడో లెక్కల్లో తేడా వచ్చి టిప్పర్లు పట్టుబడడం జరిగిందన్నారు. లెక్కలు సరిచేసుకొని మళ్లీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఇది ఎంతవరకు న్యాయమని ఆమె ప్రశ్నించారు.



ఎమ్మెల్యే భానుకు వార్నింగ్ ఇస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

వారు మాఫియాకు అధిపతులు

ఇసుక, గ్రానైట్, బియ్యం మాఫీయాకు నగరి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేలు అధిపతులుగా వ్యవహరిస్తున్నారని పత్రికలు, సోషల్ మీడియా కోడై కూస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నగరిలో గాలివాటంతో గెలిచిన గాలి భానుప్రకాష్ ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని చేయలేదని దుయ్యబట్టారు. ఇటీవల నగరిలోనే తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల రేషన్ బియ్యాన్ని ఇక్కడి అధికారులే పట్టుకొన్నారని గుర్తుచేశారు. ఈ కేసులో అరెస్టయిన ప్రధాన సూత్రధారి అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే భానుకు ప్రధాన అనుచరుడని తెలిపారు. భాను నుంచి ఫోన్ రావడంతో ఇన్నపాటి కేసుతో వెంటనే విడుదల చేసేశారన్నారు. ఇందుకు సాక్ష్యంగా ఇటీవల అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే భాను బర్త్‌డేకి ఓ పత్రికలో ఇచ్చిన ప్రధాన అడ్వర్‌టైజ్‌మెంట్‌ను చూపించారు.

ఇకపై ఉపేక్షించేది లేదు!

ఎమ్మెల్యే భానుకు రోజురోజుకు నోరు పెరిగిపోతోందని, ఇటీవల తనపట్ల తప్పుగా మాట్లాడిన విషయాలపై కేసు పెట్టడంతో పాటు డిఫరమేషన్ సూట్ వేస్తున్నట్లు చెప్పారు. ఇక ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తన గురించి మాట్లాడడానికి భానుకు అర్హతే లేదన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, నువ్వు తినే ప్రతి అవినీతి పైసా కక్కిస్తానని హెచ్చరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసిందని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వంలో ఒక్క ఏడాదిలోనే రూ.1.86 లక్షల కోట్ల అప్పుతీసుకొచ్చి చెత్త రికార్డు నెలకొల్పిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కిందన్నారు. నగరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరులో పేట్రేగుతున్న.. 'పచ్చ' మాఫియా!

- రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా
- ఒక్కో ప్లాటు రూ.7 లక్షలకు విక్రయం
- కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఆగిన కబ్జా
- ఆలస్యంగా మేల్కొన్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో కూటమికి చెందిన నాయకుల కన్ను రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములపై పడింది. ఇప్పటికే నగరంలో రాత్రిపూట ఎలాంటి బిల్లులు లేకుండా గ్రానైట్ తరలించడం, సివిల్ పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్న ప్రధాన ముఠా.. తాజాగా ప్రభుత్వ భూములపై కన్నేశారు. నగరంలోని మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన దాదాపు రూ.3 కోట్ల విలువచేసే స్థలాన్ని చదునుచేసి, రాళ్లు నాటి, ప్లాట్లు వేశారు. అంతటితో ఆగకుండా పలువురికి ప్లాట్లు కూడా అమ్మేశారు. ఆలస్యంగా మేల్కొన్న యంత్రాంగం పోలీసుల రక్షణతో గురువారం భూమిని స్వాధీనం చేసుకుంది.

రూ.కోట్ల విలువైన భూమి

నగరంలోని మంగసముద్రం వద్ద మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన డంపింగ్ యార్డు ఉంది. దీని పక్కనే సర్వే నం.113లో దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని ఆనుకునే మంగసముద్రం మీదుగా తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారి కూడా ఉంది. ఈ రెండు ఎకరాల భూమి మార్కెట్ విలువ సుమారు రూ.3 కోట్ల వరకు ఉంది. అయితే అధికార పార్టీకి చెందిన ఓ క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్ను ప్రభుత్వ భూమిపై పడింది. ఎలాగైనా దీన్ని కబ్జా చేయాలని భావించి, ఓ కూటమి నేత అనుచరుడిని ఆశ్రయించాడు. 'అన్నా, ఇద్దరం కలిసి లే–అవుట్ వేద్దాం. పెట్టుబడి నాది. లాభంలో ఇద్దరికీ చెరిసగం. నువ్వు అండగా ఉంటే చాలు. వార్డు ఇన్‌చార్జ్ కూడా మనకు సపోర్ట్ చేస్తాడు...' అంటూ ఆ వ్యక్తిని ఇందులోకి దించాడు. చిన్నపాటి గుట్టలు, ముళ్లకంపలు ఉన్న రెండు ఎకరాల భూమిని వారం రోజుల్లో శుభ్రం చేయడం, అందులో రాళ్లు నాటడం, 35కు 25 సైజులో ప్లాట్లు వేయడం చకచకా ప్రారంభించేశారు. వాట్సాప్ గ్రూపుల్లో ఈ ప్లాట్లను చూపించి, ఒక్కో ప్లాటు రూ.7 లక్షలకు అమ్ముతున్నట్లు ప్రచారం చేయడంతో.. చాలామంది ముందుకు వచ్చి ప్లాట్లు కూడా కొనేశారు.





ప్రభుత్వ భూమిలో ప్లాట్లు వేసి విక్రయానికి ఉంచిన కూటమి నేతలు, రాళ్లు తొలగిస్తున్న సిబ్బంది

కలెక్టర్ ఛీవాట్లు పెట్టడంతో..

ఇక్కడ జరుగుతున్న భూ కబ్జా బాగోతంపై కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. నిత్యం ఇటువైపు కార్పొరేషన్ డంపింగ్ వాహనాలు, అధికారుల నుంచి కార్యదర్శుల వరకు తిరుగుతున్నారు. కానీ ప్రభుత్వ భూమిని కబ్జా చేసింది అధికార పార్టీ నేతలు కావడంతో ఎవ్వరూ నోరు మెదపలేదు. చివరకు విషయం కలెక్టర్ వరకు వెళ్లింది. కలెక్టర్ కల్పించుకుని రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు ఛీవాట్లు పెట్టడంతో అధికారులు ఉరుకులు పరుగులతో ఇక్కడకు చేరుకున్నారు. గురువారం రాత్రి 8 గంటల వరకు ఇక్కడే ఉన్న మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, రెవెన్యూ అధికారులు.. ప్రభుత్వ భూమిలో పాతిపెట్టిన రాళ్లను తొలగించి, జేసీబీ సాయంతో కంచెను వేసే ప్రక్రియ చేపట్టారు.

ఎంత ధైర్యం?

ప్రభుత్వ భూమిని చెరపట్టాలంటే సామాన్యులకు వీలుకాదు. అధికార పార్టీ అండదండలు, ప్రజాప్రతినిధికి వాటాలు ఇస్తేనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసే ధైర్యం వస్తుంది. చిత్తూరులో రూ.కోట్ల విలువచేసే భూమిలో ధైర్యంగా రాళ్లు నాటి, విక్రయించే స్థాయికి వెళ్లారంటే.. ఆ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌కు ఎంతటి అధికార పార్టీ అండ దండలు లభించాయోనని సర్వత్రా చర్చించుకుంటున్నారు. మరి దీనిపై కూటమి నేతలు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి. మరోవైపు ఇది తమ వంశపారంపర్య భూమి అంటూ స్థానిక వ్యక్తి ఒకరు అధికారులకు పలు పత్రాలను అందచేశాడు. ఆన్‌లైన్ అడంగల్ నివేదికలో పరిశీలిస్తే ఇది ప్రభుత్వ భూమిగా ఉందన్న అధికారులు, కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు.

ఉద్యానశాఖకు రూ.12.6 కోట్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్ కింద చేపట్టిన పెంపకాలకు సంబంధించి ప్రభుత్వం రూ.12.6 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి మదుసూధన్‌రెడ్డి తెలిపారు. 2024–25 గాను మిషన్ కింద పండ్ల తోటలు, కూరగాయలు, పంట సంజీవని, ఆయిల్ ఫామ్ తదితర పంటను సాగు చేశామన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం కట్టమంచిలోని సూర్యప్రతాప్ కల్యాణ మండపంలో గురువారం చేనేత హస్తకళ ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో పలు రకాల దుస్తులు, మహిళలు మెచ్చే వస్తువులను అమ్మకానికి పెట్టారు. అలాగే మ్యుటేషన్ జ్యువెలర్సీలను అమ్మకానికి ఉంచారు. ప్రదర్శన ఈనెల 27వ తేదీ వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారి హేమలత, నిర్వాహకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఊచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ–4 కార్యక్రమంలో పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గర్తించి రిజిస్టర్ చేయించాలన్నారు. ఈ నెల 19వ తేదీన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో 3వ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డులో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోజా పై వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ ప్రజాప్రతినిధులు మహిళల పట్ల గౌరవంగా నడుచుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి తెలిపారు. మాజీ మంత్రి ఆర్కే రోజా పై నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సభ్యసమాజం, మహిళ లోకం సిగ్గుపడే విధంగా నీచంగా మాట్లాడడం సరికాదన్నారు. భానుప్రకాష్ తన మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విఘ్నేశ్వరా.. సీపీఎస్ రద్దు చేయించు!

కాణిపాకం: భాగస్వామ్య పింఛను పథకం(సీపీఎస్) రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ.. కాణిపాకం వినాయకునికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎన్‌పీఎస్‌ఈఎఫ్) దక్షిణ భారత ఇన్‌చార్జ్ మాచన రఘునందన్ పేర్కొన్నారు. గురువారం సీపీఎస్ రద్దు కోసం చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 20న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ రద్దు కోసం వారణాసిలో జాతీయ స్థాయి కార్యక్రమం ఉందని చెప్పారు. ఆ కార్యక్రమం విజయవంతం కావాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. పాలకులు ఎప్పటికప్పుడు సీపీఎస్ రద్దుచేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప.. పెన్షన్‌తో ఉద్యోగుల ఆర్థిక భద్రత అన్న విషయం వారికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కోటి మందికి పైగా ఉద్యోగులు కొత్త పెన్షన్ విధానం వద్దని కోరుతున్నట్లు వివరించారు. సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించేలా.. పాలకులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ.. ఆలయాల్లో పూజలు చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట రాజేశ్, దామోదర్ తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

చౌడేపల్లె: వివాహిత అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. మండలంలోని లద్దిగంకు చెందిన ఓ వివాహిత ఈనెల 14న పుంగనూరు పట్టణంలోని నక్కబండకు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె భర్త పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చైర్‌పర్సన్ల నియామకం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలు వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు- వయ్యాసి ఝాన్సీరాణి, గూడూరు - చిల్లకూరు నీరజ, పెనుమూరు- ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, పుంగనూరు - సేమిపతి, రొంపిచెర్ల - కొండా సుజాత, సూళ్లూరుపేట - ఆకుతోట రమేష్, తిరుచానూరు - ఊరుబిండి మౌనిక, వాకాడు - మర్రి ప్రమీల, వెంకటగిరి - పునుగోటి విశ్వనాథ్, నాయుడుపేట - ఉయ్యాల ప్రవీణ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మామిడి ర్యాంపుల్లో సిండికేట్!

ధర తగ్గించేస్తున్న వైనం

- లబోదిబోమంటున్న అన్నదాతలు
- పట్టించుకోని హార్టికల్చర్ అధికారులు


ర్యాంపు నిర్వాహకుల సిండికేట్‌పై మండిపడుతున్న రైతు సంఘ నాయకులు

పలమనేరు: మామిడి ర్యాంపుల్లో సిండికేట్లు చెలరేగిపోతున్నారు. పట్టణ పరిధిలో నాలుగు దాకా మామిడి ర్యాంపులను అధికారులు ఏర్పాటు చేశారు. ఇటీవల మామిడి ధరలు పెరిగిన నేపథ్యంలో తోతాపురి టన్ను ధర రూ.8వేలకు చేరింది. దీంతో స్థానికంగా మామిడి విక్రయాలు భారీగా పెరిగాయి. దీన్ని అదునుగా తీసుకున్న వ్యాపారులు సిండికేట్‌గా మారి మామిడిధరలను టన్ను రూ.7 వేలుగా చేశారు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం

రెండ్రోజుల క్రితం పలమనేరు మండలంలోని ఓ రైతు తన మామిడి కాయలను రూ.8వేల టన్నుగా ఇక్కడి ర్యాంపు వ్యాపారులకు విక్రయించాడు. అయితే ర్యాంపువ్యాపారులు సిండికేట్‌గా మారి మామడి ధరలను రూపాయి దాకా తగ్గించేశారు. దీనిపై మండిపడిన ఆ రైతు ఎందుకిలా మోసం చేశారంటూ అక్కడి ర్యాంపు నిర్వాహకులను ప్రశ్నించారు. దీనిపై ర్యాంపు నిర్వాహకలంతా ఏకమై ఇష్టముంటే అమ్ము లేకుంటే సరుకు తీసుకెళ్లు అంటూ రైతుపై దౌర్జన్యానికి దిగారు.

నోరుమెదపని హార్టికల్చర్ సిబ్బంది

పట్టణంలోని ర్యాంపుల వద్ద హార్టికల్చర్ అధికారులు స్థానిక సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్లను విధుల్లో పెట్టారు. వీరు రైతుల నుంచి ర్యాంపులకు వచ్చే సరుకు ఎన్ని టన్నులో చూసి దానికి ప్రభుత్వం ద్వారా అందే రాయితీలను అందించాల్సి ఉంది. దీంతో పాటు రైతులకు ఎలాంటి అన్యాయం జరక్కుండా చూసుకోవాలి. కానీ ఈ ర్యాంపుల వద్దనున్న హార్టికల్చర్ అసిస్టెంట్లు వ్యాపారుతో సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై హార్టికల్చర్ ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.


పలమనేరు ర్యాంపుల వద్దకొచ్చిన బయట రాష్ట్రాల వాహనాలు

చర్యలు తీసుకోవాలి

సిండికేట్లపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతు సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ర్యాంపుల యజమానులు సిండికేట్‌గా మారి మామిడి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష


అధికారులకు సూచనలు ఇస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: సీఎం చంద్రబాబు ఈ నెల 19వ తేదీన తిరుపతి పర్యటన ఉన్న నేపథ్యంలో విమానాశ్రయంలో ముందస్తు ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగుల సంఘ చైర్మన్‌గా గుణశేఖర్


గుణశేఖర్, జేఏసీ చైర్మన్


శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి


కిరణ్‌ప్రసాద్, కోశాధికారి


సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు

చిత్తూరు కలెక్టరేట్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగుల సంఘ చైర్మన్‌గా గుణశేఖర్ (పెనుమూరు, ఏపీవో) ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని గంగినేనిచెరువు పార్కులో ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ నూతన జిల్లా కమిటీ ఎన్నికలను ఏపీడీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా గౌరవాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా కిరణ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్లుగా గణేష్, మధుసూదన్ నాయుడు, మహేంద్ర, ధనంజయ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంధ్యారాణి, విశ్వనాథన్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటరమణారెడ్డి, పరమశివ, కిరణ్, రామమూర్తి, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ ఉపాధి హామీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. అలవెన్సులన్నింటినీ బేసిక్‌లతో కలిపి, గత పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచాలన్నారు. క్యాష్‌లెస్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నికైన నూతన జేఏసీ సభ్యులను పలువురు అభినందించారు.

తప్పుడు కేసుతో వేధిస్తున్నారు

పుత్తూరు: తనపై, తన మనవళ్లపై తప్పుడు కేసు బనాయించి వడమాలపేట టీడీపీ నాయకులు వేధిస్తున్నారని ఓ మహిళ మాజీ మంత్రి ఆర్కే రోజా వద్ద బోరున విలపించారు. గురువారం నగరి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై తప్పుడు కేసు గురించి పుత్తూరు కోర్టు వద్దకు వచ్చిన రోజమ్మను చూడగానే వడమాలపేట మండలం ముద్దూరువారి కింద్రిగ గ్రామానికి చెందిన ఎం.చెంచమ్మ కళ్లు చెమ్మగిల్లాయి. తనకు జరిగిన అన్యాయం గురించి చెబుతూ విలపించారు. వడమాలపేట మండలం అమ్మగుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మురళీరెడ్డి తన ఇంటి పైనుంచే దారి వదలాలంటూ వేధించారని తెలిపారు. తనపక్కనే ఉన్న చిరంజీవి ఇంటి ముందు నుంచి దారి తీసుకోవడానికి అవకాశం ఉన్నా తన ఇంటిపైనే కావాలంటూ వేధిస్తున్నారని తెలిపారు. వెంకటయ్య, జయచంద్రనాయుడు వద్దకు వెళ్లి తనకు న్యాయం చేయమని ప్రాధేయపడినా ఫలితం లేదన్నారు. తన ఇంటి స్థలం ఇవ్వడానికి వీలుపడదని తేల్చి చెప్పడంతో తనపైన, మనవళ్లు మనోజ్‌కుమార్, విజయ్, మనవరాలు ఝాన్సీ మీద తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు వాయిదా నిమిత్తమే పుత్తూరు కోర్టు వద్దకు వచ్చినట్లు వివరించారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి న్యాయం చేయాలని కోరమని సలహా ఇచ్చారు. అలాగే ప్రైవేటు కేసు వేసి కోర్టు ద్వారా న్యాయం కోరతామని హామీ ఇచ్చారు.

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,104 మంది స్వామివారిని దర్శించుకోగా 31,896 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

సూర్యప్రభపై కుమారస్వామి చిద్విలాసం


పురవీధుల్లో ఊరేగుతున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై శ్రీకాళహస్తి పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళపై టీడీపీ శ్రేణుల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కుమార్తెపై అసభ్యకరంగా ప్రవరించారని ప్రశ్నించినందుకు ఓ మహిళపై టీడీపీ శ్రేణులు దాడిచేసిన ఘటన చిత్తూరు మండలం, పచ్చనపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు .. పచ్చనపల్లినికి చెందిన కల్వి(43) కుమార్తె నీళ్ల తెస్తున్న క్రమంలో ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం కుమార్తె తల్లికి చెప్పడంతో తల్లిదండ్రులను ప్రశ్నించేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఆ యువకుడు వారి కుటుంబీకులు (టీడీపీ శ్రేణులు) బండ బూతులు తిడుతూ కల్విని కర్రలతో చితక్కొట్టారు. దీంతో కల్వి తలకు గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, నలుగురు వ్యక్తులు తమపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని కల్వి, అతని భర్త చుక్క లింగం పేర్కొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాలకు చెందిన డిప్యూటీ తహసీల్దార్లను భారీ స్థాయిలో బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. హెడ్‌క్వార్టర్ డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్ (పులిచెర్ల), కిషోర్ (సదుం), మాధవి (సోమల), దిలీప్‌కుమార్ (ఐరాల), అషారఫ్ అలీషా (విజయపురం), మహేష్ (జీడీనెల్లూరు), జయంతి (యాదమరి), ఈశ్వర్ (వెదురుకుప్పం), రిషివర్మ (పాలసముద్రం), లోకేష్ (కార్వేటినగరం), తులసీరామ్ (చిత్తూరు అర్బన్), వెంకటరమణ (గుడిపాల), నరేష్‌కుమార్ (పెనుమూరు), అనిల్‌కుమార్ (పలమనేరు), షహానా (గంగవరం), రమేష్‌బాబు(పెద్దపంజాణి), ప్రసన్నకుమార్ (బైరెడ్డిపల్లి), శివకుమార్ (శాంతిపురం), బాలాజీ (రామకుప్పం) లను నియమించారు.

రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లుగా

మధుసూదన్ (సోమల), దొరస్వామి (చౌడేపల్లి), నీలావతి (నింద్ర), మేఘవర్ణం (నగరి), శోభ (జీడీనెల్లూరు), త్యాగరాజ్ (ఎస్ఆర్‌పురం), చంద్రశేఖర్ (వెదురుకుప్పం), జోసెఫ్ (చిత్తూరు అర్బన్), లక్ష్మి (తవణంపల్లి), చంద్రశేఖర్ (యాదమరి), నరేంద్ర (గంగవరం), యోగేష్ (పెద్దపంజాణి), నందినిదేవి (శాంతిపురం), అశోక్‌కుమార్ (పాలసముద్రం) మండలాలకు కేటాయించారు.

ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లుగా

మహేశ్వరి (జీడీనెల్లూరు), మోహన్‌రాజా(పూతలపట్టు), కుప్పం ఆర్డీవో కార్యాలయంలో డీటీలుగా ప్రకాష్‌బాబు, శివకుమార్, రామమూర్తిలను నియమించారు. కలెక్టరేట్‌లో ఇనాం డీటీగా హరికృష్ణ, ప్రోటోకాల్ డీటీగా రాజశేఖర్, భూ విభాగం డీటీగా రేఖ, రవీంద్రబాబు (డీఎస్‌వో కార్యాలయం), ఇబ్రహీంను చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కోర్టు కేసులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఏపీ హైకోర్టు లైజన్ ఆఫీసర్ గా ఖాజావలి, చిత్తూరు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం డీటీగా పన్నీర్ సెల్వంను నియమించినట్టు పేర్కొన్నారు. బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దార్లు వెంటనే కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలన్నారు. విధుల్లో చేరని వారి పై శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

రేపటి నుంచి అభినయ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాలు


మాట్లాడుతున్న అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్.రెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ వారి రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి హనుమ అవార్డ్స్ నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్.రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ ఆర్ట్స్ 25వ వార్షికోత్సవంలో భాగంగా రజతోత్సవ వేడుకలుగా ఈ జాతీయ స్థాయి నృత్య, నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 9 గంటల వరకు శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాబృందాల చే 8 పౌరాణిక పద్యనాటకాలు, 11 సందేశాత్మకమైన సాంఘిక నాటికలు అద్భుత రీతిలో ప్రదర్శన ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన వారికి హనుమ అవార్డులతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అభినయ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి, గౌరవ సలహాదారుడు దామోదర గుప్త, ఉపాధ్యక్షుడు ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రపంచ మామిడి దినోత్సవానికి తరలిరండి

తిరుపతి కల్చరల్: మామిడి రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రపంచ మామిడి దినోత్సవం కార్యక్రమానికి జిల్లాలోని రైతులందరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని మామిడి రైతు సంక్షేమ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ టి.జనార్దన్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం గంధమనేని శివయ్య భవన్‌లో వారు ప్రపంచ మామిడి దినోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సీజన్‌లో మామిడి రైతుల చేతికి అందిన పంట అమ్ముకోవడానికి పడిన కష్టాలు అలివకానివన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.12 ధర సాధన కోసం నెల రోజులుగా రైతు సంఘాలు, మామిడి రైతులు పోరాడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని భవిష్యత్తులో ఇలాంటి చేదు అనుభవాలు రైతులు చవిచూడకుండా ఉండేలా పటిష్టమైన విధానం అనుసరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, మునీశ్వర్‌రెడ్డి, గోవిందస్వామి, రామ్మూర్తి నాయుడు, చంద్ర, చలపతి, వినయ్, హరికృష్ణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ
– ఆర్టీసీ మెకానిక్ మృతి


మృతుడు మోహన్‌బాబు

రొంపిచెర్ల: ద్విచక్ర వాహనం ఢీకుని ఆర్టీసీ మెకానిక్ మృతి చెందిన ఘటన రొంపిచెర్ల మండలం, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ, ఫజులుపేటలో బుధవారం రాత్రి జరిగింది. ఫజులుపేటకు చెందిన ఆర్టీసీ మెకానిక్ మోహన్‌బాబు పీలేరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నడు. రొంపిచెర్ల బస్టాండ్ నుంచి రాత్రి 10 గంటల సమయంలో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ఇంటికి నడిచి వెళ్తుతుండగా నగిరి దళితవాడకు చెందిన నూతనకుమార్ (16) ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ మెకానిక్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని చికిత్స కోసం పీలేరు ప్రభుత్వాస్పత్రికి .. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మరణించాడు. మృతుని కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

అటెండర్ ఆత్మహత్య


మృతిచెందిన రవికుమార్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ (ఆర్డీఓ)లో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ (39) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంత కాలంగా ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఇతన్ని ఇటీవల కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించడం ఇష్టంలేని రవికుమార్ మనస్తాపంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే రవికుమార్ మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

చంద్రగిరి: హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వార్డెన్ వనజ కథనం మేరకు.. పట్టణంలోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో తిరుపతికి చెందిన శ్యామ్ నాగరాజు, పీలేరుకు చెందిన గోపిచంద్ స్థానిక ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం గోపిచంద్ స్కూల్‌కు వెళ్లకుండా బయట తిరుగుతుండగా వార్డెన్ వనజ కంటపడ్డాడు. దీంతో స్కూల్‌కు ఎందుకు వెళ్లలేదని ఆమె విద్యార్థిని ప్రశ్నించారు. క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళ్లాలని, ఇలా బయటకు రాకూడదని మందలించారు. ఆపై శ్యామ్ నాగరాజ్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. చంద్రగిరికి చేరుకున్న శ్యామ్ నాగరాజ్ కుటుంబ సభ్యులు విద్యార్థిని తీవ్రంగా మందలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాచ్‌మెన్ విద్యార్థుల గదులను పరిశీలిస్తుండగా శ్యామ్ నాగరాజ్‌తోపాటు గోపిచంద్ కనిపించకుండా పోయినట్లు గుర్తించి, వార్డెన్‌కు సమాచారం అందించారు. హాస్టల్‌కు చేరుకున్న వార్డెన్ విద్యార్థులు కనిపించపోవడంతో వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల అంతా గాలించారు. శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు, నరసింగాపురం రైల్వే స్టేషన్ పరిసరాలను ఆచూకీ కోసం వెతికారు. విద్యార్థులు ఆచూకీ లభించకపోవడంతో వార్డెన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం వార్డెన్ వనజ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలను చేపట్టారు.

కుటుంబ కలహాలకు అ'బలి'



పోలీసుల అదుపులో హంతకుడు గిరి, మృతులు(ఫైల్)

పాకాల: భార్యపై అనుమానం.. కుటుంబ కలహాలు.. హతుడికి మానసిక రోగం.. వెరసి అబలతోపాటు ఇద్దరు చిన్నారులు బలైపోయారు. మద్దినాయనపల్లి పంచాయతీ పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన గిరి తన అక్క ఇంటి వద్ద ఉన్న భార్యాపిల్లలను తీసుకుని వస్తూ మార్గం మధ్యలోని తన తండ్రి వర్ధంతి సందర్భంగా సమాది వద్ద పూజలు చేశాడు. అనంతరం అదే దారిలోని బావిలో భార్యబిడ్డలను తోసి హతమార్చాడు. గిరి తిరుపతిలో ఎలక్ట్రీషియన్ పని చేస్తుండగా అతడి భార్య హేమంతకుమారి(33) లీలామహల్ వద్ద పండ్ల వ్యాపారం చేస్తోంది. వీరికి పెద్ద కుమార్తె తనుశ్రీ(10), రెండవ కుమార్తె తేజశ్రీ(6) పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో గిరి కుటుంబంతో తిరుపతి లోనే జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల కిందట గిరి పులిచెర్ల మండలం ఈ-రామిరెడ్డిగారిపల్లిలోని తన అక్కగారి ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. అక్కడే మూడు రోజులు గడిపాడు. గురువారం తన తండ్రి వర్ధంతి సందర్భంగా తిరిగి తన స్వగ్రామామైన పెద్దహరిజనవాడకు బయలుదేరాడు. మార్గం మధ్యలోని తన తండ్రి సమాది వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశాడు. ఆ తరువాత బయలుదేరి అదే మార్గంలోని కొత్త ఒడ్డిపల్లి గంగనబోయని బావి వద్దకు వారిని తీసుకెళ్లి, భార్యా బిడ్డలను బావిలోకి తోసేశాడు. వారు మరణించారని నిర్ధారించుకున్న తరువాత తాను బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం హతుడు ఆత్మహత్యకు పాల్పడే ముందు తన సోదరుడికి ఫోన్‌లో చెప్పడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే తల్లీబిడ్డలు మరణించారు. గిరిని వారు కాపాడి ఆస్పత్రికి తరలించారు. కాగా రెండు మూడు రోజులుగా గిరి మానసిక పరిస్థితి బాగా లేదని హతుడి సమీప బంధువులు చెబుతున్నారు. అలాగే కుటుంబ కలహాల కారణంగానే వారిని హత్య చేశారని మృతుల బంధువులు చెబుతున్నారు. బొమ్మల్లాంటి బిడ్డలను హతమార్చడానికి నీకు చేతులు ఎలా ఆడాయిరా నాయనా అని మృతుల బంధులు రోదనలు చూసిన వారి కంట తడి పెట్టిస్తున్నాయి. కాగా హతుడు గిరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం రేపు


రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ భవనంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఏర్పేడు: మండలకేంద్రం సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో శనివారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఐఐటీ ప్రాంగణంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ భవనాన్ని పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన ముందస్తు భద్రతా చర్యలను గురించి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎస్ సత్యనారాయణతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి పాల్గొన్నారు.